సాక్షి నల్లగొండ

శుక్రవారం ◆ 20 ◆ అక్టోబర్ ◆ 2023



ఉద్యమ పతాక.. ఆలేరు
మహిళా చైతన్యానికి ప్రతీక, మలిదశ ఉద్యమానికి దక్షిణ తెలంగాణలోనే పెట్టనికోట ఆలేరు ప్రాంతం. - IIలో



అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్
కాంగ్రెస్ పార్టీ అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ఆరోపించారు. - IVలో



తనిఖీల్లో నగదు పట్టివేత
ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో భారీగా నగదు, మద్యం పట్టుకున్నారు. - IVలో

న్యూస్‌రీల్

'విద్యుత్' పనుల నిలిపివేత

నల్లగొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలోని విద్యుత్ శాఖలో ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ (టీఅండ్‌డీ) కింద మంజూరైన పనులను అధికారులు నిలిపివేశారు. జిల్లాలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్‌ల ఏర్పాటుతోపాటు ఇతర పనులు చేపట్టేందుకు ప్రతి నియోజకవర్గానికి టీఅండ్‌డీ కింద రూ.4 కోట్ల వరకు ప్రభుత్వం గత నెలలో నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎలాంటి పనులు చేపట్టొద్దని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన విద్యుత్ పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పోలీస్ నిఘా పెంచాలి



నకిరేకల్ : సూచనలు చేస్తున్న కలెక్టర్ కర్ణన్

మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్: ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ భవనాల వద్ద పోలీస్‌శాఖ నిఘా పెంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. గురువారం మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లు, ఈవీఎంల భద్రపరిచే గదులు, రిసెప్షన్ కేంద్ర ఏర్పాటు, వాహనాల పార్కింగ్, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం దేవరకొండ, నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన వెంట నకిరేకల్ రిటర్నింగ్ అధికారి నల్లగొండ అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, మిర్యాలగూడ, దేవరకొండ ఆర్డీఓలు చెన్నయ్య, శ్రీరాములు, మూడు మున్సిపాలిటీల కమిషనర్లు పూర్ణచందర్‌రావు, వెంకటయ్య, బాలాజీ, డీఎస్పీలు వెంకటగిరి, గిరిబాబు, తహసీల్దార్లు హరిబాబు, సంతోష్‌కుమార్, ప్రసాద్‌నాయక్, పీఆర్‌ఈఈ మాధవి ఉన్నారు.

చేనేత సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న గంజి మురళీధర్

నల్లగొండ టౌన్: చేనేత కార్మికుల సమస్యలకు సంబంధించిన అంశాలను అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలో జరిగిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి చేనేత మగ్గం ఉన్న కార్మికునికి రూ.10లక్షల పెట్టుబడి సాయంగా చేనేత బంధు ప్రకటించాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రమాదబీమా, జీవిత బీమా, ఇళ్ల నిర్మాణానికి రూ.10లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్, నాయకులు కర్నాటి లింగయ్య, ఆలుకొండ మధు, ఏల శ్రీనివాస్, గడ్డం దశరథ, జిల్లా దేవదానం, రాపోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నల్లగొండ బస్ డిపో గేటు వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

నల్లగొండ రూరల్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.రాజిరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ బస్ డిపో వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్ డిపోల్లో అధికారులు, సూపర్‌వైజర్లు వివిధ కారణాలతో కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. బండ్లగూడ డిపోలో కండక్టర్ శ్రీవిద్య అధికారుల వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం నేటికీ నెరవేర్చలేదన్నారు. గతంలో సమ్మె చేస్తే అవమానించి నేడు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటించి పీఆర్సీ, వేతన బకాయిలు, డీఏ చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో జేఏసీ నాయకులు రాజు, సీహెచ్.రెడ్డి, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

● బతుకమ్మ వేడుకలు





నల్లగొండ ఎఫ్‌సీఐ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు, జిల్లా కేంద్రంలోని ఆర్యన్స్ యోగా సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

భారీ మెజార్టీతో గెలవాలి

- సీఎం చేతుల మీదుగా బీఫాం అందుకున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు




భాస్కర్‌రావుకు బీఫాం అందిస్తున్న సీఎం కేసీఆర్

మిర్యాలగూడ: వచ్చే నెల జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందాలని ముఖ్యమంత్రి కేసీఆర్.. నల్లమోతు భాస్కర్ రావుకు సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో భాస్కర్‌రావుకు సీఎం కేసీఆర్ బీఫాంను అందజేసి దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేయడంతోపాటు మేనిఫెస్టోను కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు.

ఏక్‌బార్.. ఎమ్మెల్యే

ఒక్కసారే విజయం.. ఆ తరువాత కనుమరుగు

- రెండోసారి పోటీచేసే అవకాశం రాని వారు కొందరు
- చాన్స్ దక్కినా.. గట్టెక్కని వారు మరికొందరు
- మరోమారు గెలుపు కోసం పలువురు మాజీల ప్రయత్నం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎంతగానో పోరాడితే వచ్చిన అవకాశంతో గెలిచి అసెంబ్లీలో ఒకసారి అడుగు పెట్టారు. ఆ తరువాత వారిలో చాలా మందికి మరోసారి అవకాశం రాలేదు. వచ్చినా.. గెలువలేక కనుమరుగయ్యారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా అసెంబ్లీ ఎన్నికల పోరులో చతికిలపడ్డారు. అలాంటి నేతలు ఉమ్మడి జిల్లాలో చాలా మందే ఉన్నారు. 1952 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో చాలా మంది నేతలది అదే పరిస్థితి. రెండోసారి ఎమ్మెల్యే అయ్యేందుకు ఎంత ప్రయత్నించినా ఒక్కసారికే పరిమితమై.. వన్‌టైమ్ వండర్స్‌గా మిగిలిపోయారు.

రెండోసారి అదృష్టం ఎందరికో..

ఉమ్మడి జిల్లాలో 2018, ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన వారంతా ఇప్పుడు మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అందులో కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్ ఉన్నారు. 2014లో గెలిచి, 2018లో ఓడిపోయిన వేముల వీరేశం రెండోసారి పోటీలో ఉండనుండగా, 2018 ఎన్నికల్లో గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మూడోసారి బరిలో ఉండబోతున్నారు. వారిలో ఎవరు ఎమ్మెల్యేగా ఒక్కసారికే పరిమితం అవుతారు.. ఎవరు రెండోసారి గెలుస్తారనేది ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

1952 నుంచి నియోజకవర్గాల వారీగా ఇలా..

- **నల్లగొండ:** 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న నల్లగొండ నుంచి పీడీఎఫ్ తరఫున గెలిచిన పి.లక్ష్మయ్య, కట్టా రాంరెడ్డి ఒక్కసారికే పరిమితం అయ్యారు. 1957లో పీడీఎఫ్ నుంచే గెలిచిన వెంకటరెడ్డిది కూడా అదే పరిస్థితి. 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన గడ్డం రుద్రమదేవి, 1989లో టీడీపీ నుంచే విజయం సాధించిన మల్‌రెడ్డి రఘుమారెడ్డి, 1994లో సీపీఎం నుంచి గెలిచిన నంద్యాల నర్సింహారెడ్డి ఒక్కసారికే పరిమితం అయ్యారు.
- **నకిరేకల్:** ఇక్కడ 1962లో సీపీఐ నుంచి గెలిచిన నంద్యాల శ్రీనివాసరెడ్డి, 1972లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎం.కమలమ్మ ఆ తరువాత తెరమరుగయ్యారు. 2014లో గెలిచిన వేముల వీరేశం ఇప్పుడు మళ్లీ పోటీలో ఉన్నారు.
- **మునుగోడు:** 1952 నుంచి 1965 వరకు చిన్నకొండూరు నియోజకవర్గంగా ఉండగా, 1967 నుంచి మునుగోడుగా మారింది. 1952లో కె.వెంకటరామారావు, 1962లో కె.గురునాథ్‌రెడ్డి ఒక్కొక్క సారే ప్రాతినిధ్యం వహించారు. కె.వెంకటరామారావు 1957లో రెండోసారి పోటీచేసే అవకాశం వచ్చినా విజయం సాధించలేదు. 2004లో సీపీఐ నుంచి పల్లా వెంకటరెడ్డి, 2009లో ఉజ్జిని యాదగిరిరావు ఒక సారికే పరిమితం అయ్యారు.
- **నాగార్జునసాగర్:** 1962లో పెద్దవూర నియోజకవర్గంగా, 1967 నుంచి 2004 ఎన్నికల వరకు చలకుర్తి నియోజకవర్గంగా ఉండి 1999 నుంచి నాగార్జునసాగర్ నియోజకవర్గంగా మారింది. 1962లో సీపీఐ నుంచి గెలిచిన పి.పర్వతరెడ్డి ఇక్కడి నుంచి మళ్లీ పోటీ చేయలేదు. ఈయన 1967లో దేవరకొండ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 1994 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ మళ్లీ గెలవలేదు.
- **మిర్యాలగూడ:** 1957లో పీడీఎఫ్ నుంచి గెలిచిన సి.వెంకట్‌రెడ్డి ఇక రెండోసారి పోటీచేయలేదు. 1989లో కాంగ్రెస్ నుంచి గెలిచిన తిప్పన విజయసింహారెడ్డి రెండోసారి గెలవలేదు. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన రేపాల శ్రీనివాస్ కూడా ఒక్కసారే గెలిచారు. 1983లో ఎమ్మెల్యేగా పనిచేసిన చకిలం శ్రీనివాసరావు ఆ తరువాత ఎంపీగా గెలిచారు.
- **హుజూర్‌నగర్** : 1952 నుంచి 1972 వరకు ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గం ఆ తరువాత రద్దయింది. 2009 ఎన్నికల్లో పునరుద్ధరించారు. 1952లో పీడీఎఫ్ నుంచి గెలిచిన టి.నర్సింహులు, జయసూర్య, అదే ఏడాది ఉప ఎన్నికల్లో గెలిచిన ఎం.మొహియుద్దీన్, 1957లో గెలిచిన దొడ్డా నర్సయ్య రెండోసారి గెలవలేదు. 1972లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన కె.జితేందర్‌రెడ్డికి నియోజకవర్గం రద్దుతో ఆ తరువాత అవకాశం రాలేదు.

- **సూర్యాపేట:** ఈ నియోజకవర్గం మొదట జనరల్ స్థానంగా, ఆ తర్వాత ఎస్సీ రిజర్వుడుగా తిరిగి 2009 నుంచి జనరల్ స్థానంగా మారింది. 1972లో యడ్ల గోపయ్య, 1978లో అనుములపురి పరంధాములు గెలిచి.. ఆ తరువాత తెరమరుగయ్యారు. టీడీపీ తరఫున 1983లో ఈద దేవయ్య, 1985లో డి.సుందరయ్య ఒక్కసారికే పరిమితం అయ్యారు. 1999లో దోసపాటి గోపాల్, 2004లో వేదాసు వెంకయ్య ఒక్కసారికే పరిమితం అయ్యారు.
- **తుంగతుర్తి** : 1962లో నాగారం నియోజకవర్గంగా ఉండగా 1967 నుంచి తుంగతుర్తిగా మారింది. 1962లో ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎ.రంగారెడ్డి మళ్లీ గెలువలేదు. 1967లో గెలిచిన బి.నారాయణరెడ్డి, 1972లో జి.వెంకటనర్సయ్య ఒక్కసారికే పరిమితం అయ్యారు. 1999లో టీడీపీ నుంచి సంకినేని వెంకటేశ్వరరావు ఒక్కసారే గెలిచారు.

- **కోదాడ** : 1978లో ఏర్పాటైన కోదాడ నియోజకవర్గం నుంచి గెలిచిన అక్కిరాజు వాసుదేవరావు ఆ తరువాత తెరమరుగయ్యారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా గెలిచిన వి.లక్ష్మీనారాయణరావు 1989లో పోటీచేసినా విజయం సాధించలేదు.
- **భువనగిరి:** 1952లో ఈ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన గోక రామలింగం మళ్లీ అసెంబ్లీలో కనిపించలేదు. 1962లో పీడీఎఫ్ నుంచి గెలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి ఒక్కసారికే పరిమితం అయ్యారు.
- **ఆలేరు:** 1952 నుంచి1972 వరకు జనరల్ స్థానంగా ఉన్న ఈ నియోజకవర్గం 1978లో ఎస్సీ రిజర్వుడ్ అయ్యింది. తిరిగి 2009లో జనరల్ స్థానంగా మారింది. ఇక్కడి నుంచి 1978లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సాలూరి పోచయ్యకు 1983లో పోటీచేసినా గెలువలేదు. 2009లో కాంగ్రెస్ తరఫున గెలిచిన బూడిద భిక్షమయ్యగౌడ్ ఆ తరువాత రెండు ఎన్నికల్లో ఓడిపోయారు.
- **దేవరకొండ:** ఈ నియోజకవర్గంలో 1952 ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి గెలిచిన అనంత రామారావు మళ్లీ అసెంబ్లీ ముఖం చూడలేదు. 1957లో ఇద్దరు ఎమ్మెల్యేలు (ద్విసభ్య నియోజకవర్గం) విజయం సాధించగా వారిలో ఎం.లక్ష్మయ్య (కాంగ్రెస్) తిరిగి ఏ ఎన్నికల్లోనూ గెలవలేదు. 1962లో సీపీఐ నుంచి గెలిచిన యెలిమినేటి పెద్దారెడ్డి (వై.పెద్దయ్య), 1972లో సీపీఐ నుంచే గెలిచిన బి.రామశర్మ ఒక్కసారికే పరిమితం అయ్యారు. 1978లో ఈ స్థానం ఎస్టీలకు రిజర్వు అయింది. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రాగ్యానాయక్ నక్సలైట్ల చేతిలో హతమయ్యారు. దీంతో 2002లో జరిగిన ఉప ఎన్నికల్లో రాగ్యానాయక్ భార్య భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమె ఆ తరువాత మళ్లీ అసెంబ్లీకి పోటీ చేయలేదు.

గులాబీ గూటికి చెరుకు సుధాకర్

- మంత్రి జగదీష్‌రెడ్డి మంతనాలు సక్సెస్
- ఫోన్‌లో మాట్లాడిన మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు
- నేడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్న సుధాకర్
- రేపో, ఎల్లుండో బీఆర్‌ఎస్ కండువా వేసుకోనున్న ఉద్యమకారుడు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ నెల 21 లేదా 22న ఆయన బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. చెరుకు సుధాకర్‌ను బీఆర్‌ఎస్‌లోకి రావాలని మంత్రి జగదీష్‌రెడ్డి గురువారం సాయంత్రం ఆయనను కలిసి చర్చలు జరిపారు. అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్‌రావుతో ఫోన్‌లో మాట్లాడించారు. ఉద్యమకారులకు బీఆర్‌ఎస్ పార్టీలోనే ప్రాధాన్యం దక్కుతుందని వారు చేసిన సూచన మేరకు చెరుకు సుధాకర్ గులాబీ కండువా వేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నకిరేకల్‌లో వేముల వీరేశంను కాంగ్రెస్‌లోకి తీసుకురావడం, పోటీలో ఉంచడం, బీసీలకు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ స్థానాలను కేటాయిస్తామని ప్రకటించిన ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడం తనకు నచ్చలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను బీఆర్‌ఎస్ లోకి వెళ్లి కాంగ్రెస్ నేతల తీరుపై పోరాటం చేయాలని భావిస్తున్నట్లు సుధాకర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నల్లగొండలో కాంగ్రెస్ పార్టీకి చెందిన తన శ్రేయోభిలాషులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, అధికారికంగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. అదే రోజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. ఈ నెల 21 లేదా 22వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లి సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు.

బీఆర్‌ఎస్‌లో కంచర్ల ఒక్కరే ఉంటారు



మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, చిత్రంలో గుమ్మల మోహన్‌రెడ్డి, నాయకులు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

- కోమటిరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ: నవంబర్ 30వ తేదీ నాటికి బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తప్ప ఒక్క నాయకుడు ఉండడని.. కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీలు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరతారని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, బోయినపల్లి శ్రీనివాస్, ఖయూమ్‌బేగ్, బషీర్, సమీలతో కలిసి గురువారం నల్లగొండలోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లను సంతలో పశువుల్లా కొంటున్నారని అనడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. నాలుగేళ్ల పాటు కౌన్సిలర్లు, నాయకులు బీఆర్‌ఎస్‌లో గౌరవం లేకున్నా మనసు చంపుకొని పనిచేశారు. ఇంకా ఆత్మాభిమానం చంపుకోలేక తిరిగి కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఎంపీ కోమటిరెడ్డితోపాటు కౌన్సిలర్లను విమర్శిస్తే సహించేది లేదన్నారు. చివరకు నీలగిరి మున్సిపల్ చైర్మన్ కూడా కాంగ్రెస్ పార్టీలోకి రాక తప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో కోమటిరెడ్డి గెలువడం ఖాయమని, నీవు నీ సొంత ఊరు ఉరుమడ్ల గ్రామ బాట పట్టక తప్పదన్నారు. వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు నీతో జర్నీ చేసి వేదనకు గురయ్యామన్నారు. రేపు ప్రజల్లో ఎవరి బలం ఎంతో తేల్చుకుందామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు బొజ్జ శంకర్, గోగుల రాములమ్మ, గడిగ శ్రీను హిమబిందు, బుర్రి రజిత యాదయ్య, కేసారి వేణుగోపాల్‌రెడ్డి, ఏర్పుల రవి, సమద్, నాయకులు అనూప్‌రెడ్డి, జూకూరి రమేష్, ఎంపీటీసీలు గరిచైతన్య, పాండు, కరుణాకర్‌రెడ్డి, సైదులు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ.. కాంగ్రెస్‌లోకి నల్లగొండ ఎంపీపీ

నల్లగొండ రూరల్: నల్లగొండ ఎంపీపీ మనిమిద్దె సుమన్ గురువారం హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్న సుమన్ మరలా సొంతగూటికి చేరారు.

ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలి

నల్లగొండ రూరల్, నార్కట్‌పల్లి: రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని డీఆర్‌డీఓ కాళిందిని, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నల్లగొండ మండలం ఖుదావన్‌పూర్, నార్కట్‌పల్లి మండలం నెమ్మానిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో డీఎం నాగేశ్వర్‌రావు, డీపీఓ రామలింగం, తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ యాదగిరి పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్‌లో చేరనున్న 'జిట్టా'

- 14 ఏళ్ల తర్వాత సొంత గూటికి వెళ్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి



సాక్షి, యాదాద్రి: తెలంగాణ ఉద్యమ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జిట్టా.. ఆ పార్టీ నుంచి భువనగిరి టికెట్ ఆశించారు. కాంగ్రెస్ టికెట్ రాదని తేలిపోవడంతో కొంత కాలంగా మౌనంగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరుతారని కొద్ది రోజులుగా సాగుతున్నప్రచారానికి తెరదించుతూ గురువారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి ప్రగతి భవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతో చర్చలు జరిపారు. పార్టీలోకి వారు ఆహ్వానించడంతో శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ కండువా వేసుకోనున్నారు.

ఉద్యమంలో కేసీఆర్ వెంట..

జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచారు. టీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉద్యమంలో ముందుండి పనిచేసి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడయ్యారు. అప్పట్లో భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో తెలంగాణ వంటలు, కళలు, కళారూపాలను పరిచయం చేశారు. భువనగిరి కోటను విద్యుత్ దీపాలతో అలంకరించి సంచలనం సృష్టించారు. తెలంగాణ ఉద్యమం కంటే ముందు నుంచే యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షునిగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి గుర్తింపు పొందారు జిట్టా బాలకృష్ణారెడ్డి.

భువనగిరి టికెట్ రాలేదని..

2009 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి భువనగిరి ఎమ్మెల్యే టికెట్ రాలేదని ఆగ్రహించిన జిట్టా.. ఆ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట క్రమంలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ.. టీడీపీతో పొత్తుపెట్టుకోవడంతో భువనగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలిమినేటి ఉమామాధవరెడ్డి టీడీపీ నుంచి మహా కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో జిట్టా బాలకృష్ణారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి రెండవ స్థానంతో సరిపెట్టుకున్నారు. అనంతరం ఆయన దివంగత నేత వైఎస్సార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వైఎస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్‌ను వీడారు. 2014లో భువనగిరి అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా పోటీచేసి అప్పుడు కూడా రెండో స్థానంలోనే నిలిచారు. వైఎస్సార్‌సీపీలో చేరి కొంత కాలం పనిచేసిన అనంతరం యువ తెలంగాణ పార్టీని స్థాపించారు. 2018లో మరోసారి బీజేపీ బలపర్చిన అభ్యర్థిగా యువతెలంగాణ పార్టీ నుంచి భువనగిరి అసెంబ్లీ సీటుకు పోటీ చేసినా గెలుపు అందుకోలేకపోయారు. ఆ తర్వాత యువ తెలంగాణ పార్టీ అధ్యక్షుని హోదాలో జిట్టా బాలకృష్ణారెడ్డి 2022 ఫిబ్రవరిలో తన పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని పార్టీని డిమాండ్ చేయడంతో జిట్టాపై క్రమశిక్షణా చర్యల కింద బీజేపీ నుంచి సస్పెండ్ చేశారు.

నెలక్రితం కాంగ్రెస్‌లో చేరిక

భువనగిరి అసెంబ్లీ టికెట్ లక్ష్యంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమక్షంలో సెప్టెంబర్ 16న జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కుంభం అనిల్ కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జిట్టా కాంగ్రెస్‌లోకి వెళ్లారు. అసెంబ్లీ టికెట్ కోసం పార్టీ పెద్దల నుంచి కూడా ఆశీస్సులు పొందారు. అయితే, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లోకి రావడంతో బాలకృష్ణారెడ్డి స్తబ్దుగా ఉన్నారు.

కేటీఆర్, హరీష్‌రావుతో చర్చలు

మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతో గురువారం జిట్టా భేటీ అయ్యారు. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సమక్షంలో మంత్రులు జిట్టాతో చర్చలు జరిపారు. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని మంత్రులు కోరారు. రాజకీయ భవిష్యత్తుకు హామీ ఇవ్వడంతో తన అనుచరులతో కలిసి శుక్రవారం పార్టీలో చేరుతున్నానని జిట్టా 'సాక్షి'తో చెప్పారు. 14 ఏళ్ల క్రితం వీడిన పార్టీలోకి తాను ఇప్పుడు అడుగుపెడుతున్నానని వెల్లడించారు.

కార్యకర్తలు అయోమయానికి గురికావొద్దు

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ: మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ ఎవరి కేటాయించే విషయంపై కాంగ్రెస్ అధిష్టానం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. కార్యకర్తలు అయోమయానికి గురికావొద్దని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, నాయకులు పగిడి రామలింగయ్య యాదవ్, తలకొప్పుల సైదులు, పాదిలి శ్రీనివాస్, వెంకన్న, బసవయ్యగౌడ్, మాలి కాంతారెడ్డి, ఆవుల రెడ్డి, మేడ సురేందర్‌రెడ్డి, లలిత, మెరుగు శ్రీనివాస్, సలీం, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

● భార్య, కుమార్తె ప్రచారం



బీబీనగర్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ఓట్లు అడుగుతున్న భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి శేఖర్‌రెడ్డి సతీమణి వనిత, మహిళలు - బీబీనగర్



భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ భువనగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి కుమార్తె మన్వితారెడ్డి - సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

● రథాలు సిద్ధం



నకిరేకల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఎన్నికల ప్రచారానికి సిద్ధమైన వాహనాలు - సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఉద్యమ పతాక.. ఆలేరు

- రాజకీయ చైతన్యానికి పుట్టినిల్లు
- ఆలయాలకు నెలవు
- ఐదు సార్లు మహిళా ఎమ్మెల్యేల గెలుపు
- ఇక్కడి నుంచి మోత్కుపల్లి వరుసగా ఐదు పర్యాయాలు విజయం



ఆలేరు రైల్వే స్టేషన్



అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

సాక్షి, యాదాద్రి : నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరు నడిపిన గడ్డ, మహిళా చైతన్యానికి ప్రతీక, మలిదశ తెలంగాణ ఉద్యమానికి దక్షిణ తెలంగాణలోనే పెట్టనికోట ఆలేరు. ఈ నియోజకవర్గం నిత్య చైతన్యంగా ఉంటుంది. పుణ్యక్షేత్రాలు, కళలు, సాహిత్యం, సాంస్కృతిక, క్రీడా రంగాలకు నిలయం. ఇక్కడి ఓటరు తీర్పు విలక్షణం. ఈ నియోజకవర్గంలో ఐదు సార్లు మహిళా ఎమ్మెల్యేలు గెలుపొందారు. ఇక్కడి నుంచి మోత్కుపల్లి నర్సింహులు వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది.. పలుమార్లు మంత్రిగా పని చేశారు.

ఆలేరుకు ప్రత్యేక స్థానం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం కలిగి ఉంది. 1952లో ఏర్పాటైన నియోజకవర్గం జనరల్ కేటగిరీ నుంచి 1978లో ఎస్సీ రిజర్వ్‌డ్ చేయబడింది. 2009లో జనరల్ కేటగిరిలోకి మారింది. నల్లగొండ, సిద్దిపేట, మేడ్చల్, జనగామ, సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గంలో ఆలేరు, యాదగిరిగుట్ట, రాజాపేట, తుర్కపల్లి, మోటకొండూరు, బొమ్మలరామారం, గుండాల, ఆత్మకూర్ (ఎం) మండలాలు ఉన్నాయి. భౌగోళికంగానూ.. ఓటర్ల సంఖ్యా పరంగా ఆలేరు అతిపెద్ద నియోజకవర్గం. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం 2,27,738 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,14,388 మంది పురుషులు, 1,13,332 మంది మహిళలు, 18 మంది ఇతరులు ఉన్నారు. 1952 నుంచి 2018 వరకు 16 సార్లు జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ రెండు సార్లు, కాంగ్రెస్, కాంగ్రెస్ ఐ ఐదు సార్లు, టీడీపీ మూడుసార్లు, టీఆర్‌ఎస్ నాలుగు సార్లు, ఇండిపెండెంట్ ఒకసారి గెలుపొందారు.

పాడి పంటలకు నెలవు

పాడి పంటలకు నెలవు ఆలేరు. ఇక్కడి రైతులు సాగర్ ఆయకట్టు సమానంగా ధాన్యం పండిస్తారు. పత్తి కూడా అధికంగా పండుతుంది. దేవాదుల, బునాదిగాని కాల్వలతోపాటు బోరు బావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. పాడి పరిశ్రమ, నేత, గీత వృత్తులు ప్రధానం. ఇక్కడి నుంచి పనుల కోసం హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే సాగునీటికి ఢోకా ఉండదు.

ఆలయాలకు నిలయం..

ఆలేరు నియోజకవర్గానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. చారిత్రక ఆలయాల సంపద, తెలంగాణ సాయుధపోరాట నేపథ్యం ఉంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, కొలనుపాక జైన దేవాలయం, శ్రీసోమేశ్వరాలయం ఇక్కడి ప్రత్యేకత. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఈ నియోజకవర్గంలోనే ఉంది. తెలంగాణ ప్రభుత్వం రూ.1200 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టింది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆలయంగా తీర్చిదిద్దింది. తెలంగాణ సాయుధపోరాట సేనానులు ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి దంపతులు, రేణికుంట రామిరెడ్డి, కుర్రారం రామిరెడ్డి వంటి వీరులగన్న భూమి ఆలేరు. శాసనసభలో తొలి మహిళా ప్రతిపక్ష నేత ఆరుట్ల కమలాదేవి ఇక్కడివారే కావడం గమనార్హం.

ఎమ్మెల్యేలుగా ఆరుట్ల దంపతులు

ఆలేరు ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఆరుట్ల దంపతులు ముందుండి నడిపించారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఈ దంపతులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఆరుట్ల కమలాదేవి ఆలేరు నుంచి మూడుసార్లు వరుసగా గెలపొందారు. ఈమె భర్త ఆరుట్ల రామచంద్రారెడ్డి మెదక్ జిల్లా రామాయంపేట, భువనగిరి నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

వరుస విజయాల మోత్కుపల్లి..

మోత్కుపల్లి నర్సింహులు ఆలేరు నియోజకవర్గంలో వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలుగుదేశం ఆవిర్భావంతో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన మోత్కుపల్లి నర్సింహులు ఎన్టీఆర్ మంత్రివర్గంలో గనులు, భూగర్భ జలవనరులు, సాంఘిక సంక్షేమ, విద్యుత్, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేశారు. టీడీపీ నుంచి మూడుసార్లు ఇండిపెండెంట్‌గా ఒకసారి, కాంగ్రెస్ నుంచి ఒకసారి విజయం సాధించారు.



ఆరుట్ల కమలాదేవి



సీహెచ్. పోచయ్య



ఎం. నర్సింహులు



కుడుదుల నగేష్



బి.భిక్షమయ్యగౌడ్



గొంగిడి సునీత

ఆలేరు నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు..

సంవత్సరం	గెలిచినవారు	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
1952	ఆరుట్ల కమలాదేవి	పీడీఎఫ్	కె.ఆర్.కె రెడ్డి	కాంగ్రెస్
1957	ఆరుట్ల కమలాదేవి	పీడీఎఫ్	అనిరెడ్డి పున్నారెడ్డి	కాంగ్రెస్
1962	ఆరుట్ల కమలాదేవి	సీపీఐ	అనిరెడ్డి పున్నారెడ్డి	కాంగ్రెస్
1967	అనిరెడ్డి పున్నారెడ్డి	కాంగ్రెస్	పి. చెన్నారెడ్డి	సీపీఐ
1972	అనిరెడ్డి పున్నారెడ్డి	కాంగ్రెస్	కె.వై. రెడ్డి	ఇండిపెండెంట్
1978	చల్లూరి పోచయ్య	కాంగ్రెస్	పి. వెంకట్రాములు	జనతాపార్టీ
1983	మోత్కుపల్లి నర్సింహులు	టీడీపీ	పోచయ్య	కాంగ్రెస్
1985	ఎం.నర్సింహులు	టీడీపీ	సి. కెన్నడి	కాంగ్రెస్
1989	ఎం.నర్సింహులు	ఇండిపెండెంట్	సున్నం యాదగిరి	టీడీపీ
1994	ఎం.నర్సింహులు	టీడీపీ	డాక్టర్ నగేష్	కాంగ్రెస్
1999	ఎం.నర్సింహులు	కాంగ్రెస్	డాక్టర్ నగేష్	టీడీపీ
2004	డాక్టర్ నగేష్	టీఆర్‌ఎస్	ఎం.నర్సింహులు	టీడీపీ
2008(ఉప)	డాక్టర్ నగేష్	టీఆర్‌ఎస్	ఎం.నర్సింహులు	టీడీపీ
2009	బూడిద భిక్షమయ్యగౌడ్	కాంగ్రెస్	కళ్లెం యాదగిరిరెడ్డి	టీఆర్‌ఎస్
2014	గొంగిడి సునీత	టీఆర్‌ఎస్	భిక్షమయ్యగౌడ్	కాంగ్రెస్
2018	గొంగిడి సునీత	టీఆర్‌ఎస్	భిక్షమయ్యగౌడ్	కాంగ్రెస్

నిబంధనలు ఉల్లంఘిస్తే.. ఫిర్యాదు చేయండి





భువనగిరిలోని వినాయక చౌరస్తాలో సీ-విజిల్ యాప్ గురించి తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఇన్‌సెట్‌లో) హైదరాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

- ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీల ఏర్పాటు

భువనగిరిటౌన్ : రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు ఎన్నిక నిబంధనలను ఉల్లంఘిస్తే.. వారిపై ఫిర్యాదు చేయాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఏ విధమైన పనులు చేయకూడదో పేర్కొంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. భువనగిరి పట్టణంలోని ప్రధాన కూడళ్లో ఇవి వెలిశాయి. ఎన్నికల కోడ్‌కు సంబంధించిన నియమ నిబంధనలను ఆ ఫ్లెక్సీల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సీ-విజిల్ (c VIGIL) యాప్ ద్వారా నేరుగా జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

ఇవీ.. ఉల్లంఘన కిందికి వస్తాయి

1. రాజకీయ ఉద్దేశంతో మద్యం, డబ్బు పంపిణీ
2. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా బహుమతులు/వస్తువులు పంచడం
3. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై ప్రదర్శించడం
4. డబ్బు చెల్లించి వార్తలను అనుకూలంగా రాయించుకోవడం
5. తమకు ఓటు వేయాలని భయాందోళనలకు గురిచేయడం
6. ఉద్రేకపూరిత ప్రసంగాలు చేయడం
7. ఓటర్లను వాహనాలలో తరలించడం
8. ఆయుధాలను ప్రదర్శించడం

తొలి ఎన్నికల్లో పీడీఎఫ్ ప్రభంజనం

- 1952లో పోరాట వీరులకు నీరాజనం
- ఉమ్మడి జిల్లాలో అప్పుడున్న 9 నియోజకవర్గాల్లోనూ విజయం

సాక్షి, యాదాద్రి : ప్రజల స్వేచ్ఛా స్వాతంత్య్రం కోసం తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన వారికి తెలంగాణ విముక్తి తర్వాత జరిగిన 1952 తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నీరాజనం పట్టారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పీడీఎఫ్ ప్రభంజనం సృష్టించింది. ఆనాటి మొత్తం 9 నియోజకవర్గాల నుంచి 12 మంది శాసనసభ్యులు ఎన్నికయ్యారు. ఇందులో సూర్యాపేట, నల్లగొండ, హుజూర్‌నగర్ ద్విసభ్య నియోజకవర్గాలు కాగా.. ఆ మూడు స్థానాల నుంచి ఇద్దరు చొప్పున ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. అన్ని నియోజకవర్గాల్లో పీడీఎఫ్ అభ్యర్థులు విజయశంఖం పూరించారు.

ఉమ్మడి జిల్లా నుంచి తొలి ఎమ్మెల్యేలు వీరే..

నియోజకవర్గం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప అభ్యర్థి	పార్టీ
దేవరకొండ	అనంతరామారావు	పీడీఎఫ్	ఎం.కె.రావు	కాంగ్రెస్
పెద్దమునగాల (ప్రస్తుతం మిర్యాలగూడ)	ఎ.వెంకట్రామరావు	పీడీఎఫ్	ఎం.ఎస్.రెడ్డి	కాంగ్రెస్
హుజూర్‌నగర్(ద్వి)	జయసూర్య	పీడీఎఫ్	కె.ఎల్.ఎన్.రావు	కాంగ్రెస్
	టి.నర్సింహులు	పీడీఎఫ్	సుమిత్రాదేవి	కాంగ్రెస్
సూర్యాపేట(ద్వి)	బి.ధర్మభిక్షం	పీడీఎఫ్	జీ.ఎ.రెడ్డి	కాంగ్రెస్
	ఉప్పల మల్సూర్	పీడీఎఫ్	జీపీ సర్వేష్	కాంగ్రెస్
నల్లగొండ(ద్వి)	కె.రమారెడ్డి	పీడీఎఫ్	వీ.ఆర్.రావు	కాంగ్రెస్
	లక్ష్మయ్య	పీడీఎఫ్	ఎం.సాయిలు	కాంగ్రెస్
చిన్నకొండూరు (ప్రస్తుతం మునుగోడు)	వెంకట్రామరావు	పీడీఎఫ్	జీబీఎన్‌రావు	కాంగ్రెస్
భువనగిరి	రావి నారాయణరెడ్డి	పీడీఎఫ్	వి.రెడ్డి	కాంగ్రెస్
రామన్నపేట (ప్రస్తుతం నకిరేకల్)	కె.రామచంద్రారెడ్డి	పీడీఎఫ్	కేశవరావు	కాంగ్రెస్
ఆలేరు	ఆరుట్ల కమలాదేవి	పీడీఎఫ్	కె.ఆర్.కె.రెడ్డి	కాంగ్రెస్

అత్యధిక మెజారిటీ వారిదే..

- ఇప్పటికీ ఎలిమినేటి దంపతులదే రికార్డు
- అత్యల్ప మెజారిటీ.. సాధారణ ఎన్నికల్లో దేవయ్యకు
- ఉప ఎన్నికలో రామలింగంకు

సాక్షి, యాదాద్రి : ఉమ్మడి జిల్లాలో 1952 నుంచి 2018 అసెంబ్లీ ఎన్నికల వరకు చూస్తే.. అత్యధిక మెజారిటీ 'ఎలిమినేటి' కుటుంబ సభ్యులదే. భువనగిరి నుంచి వరుసగా నాలుగుసార్లు గెలిచిన ఎలిమినేటి మాధవరెడ్డి 2000 సంవత్సరంలో నక్సల్స్ మందుపాతరకు బలయ్యారు. అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి బరిలో నిలిచిన మాధవరెడ్డి సతీమణి ఉమామాధవరెడ్డి అత్యధికంగా 46,485 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 78,389 ఓట్లు రాగా.. సమీప అభ్యర్థి కాంగ్రెస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డికి 31,901 ఓట్లు వచ్చాయి. ఉప ఎన్నిక కాకుండా.. అంతకుముందు 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన ఎలిమినేటి మాధవరెడ్డికి 43,519 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఇదే రికార్డు. ఆ ఎన్నికల్లో మాధవరెడ్డికి 77,265 ఓట్లు రాగా.. సమీప కాంగ్రెస్ అభ్యర్థి మాదుగుల నర్సారెడ్డికి 33,746 ఓట్లు వచ్చాయి.

అత్యల్ప మెజారిటీ ఇలా..

అత్యల్ప మెజారిటీ కూడా భువనగిరి నుంచే నమోదైంది. 1952 తొలి ఎన్నికల్లో భువనగిరి నుంచి పీడీఎఫ్ అభ్యర్థి రావి నారాయణరెడ్డి విజయం సాధించారు. ఆయన నల్లగొండ ఎంపీగా కూడా గెలవడంతో భువనగిరి సీటుకు రాజీనామా చేశారు. ఈ సీటుకు అదే సంవత్సరం జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన జి.రామలింగం 309 ఓట్ల అత్యల్ప మెజారిటీతో విజయం సాధించారు. ఆయనకు 12,121 ఓట్లు రాగా.. సమీప అభ్యర్థి, పీడీఎఫ్ నాయకుడు షరీఫ్‌కు 11,812 ఓట్లు వచ్చాయి.

1983లో సూర్యాపేటలో...

సాధారణ ఎన్నికల్లో చూస్తే.. 1983లో సూర్యాపేట నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీచేసిన ఈద దేవయ్య 342 స్వల్ప ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆయనకు 23581 ఓట్లు రాగా.. సమీప కాంగ్రెస్ అభ్యర్థి బీఎం రాజుకు 23,239 ఓట్లు వచ్చాయి.

కమిటీ నిర్ణయం మేరకు సామగ్రి ధరలు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు

- నేడు మొదటి విడత ర్యాండమైజేషన్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అభ్యర్థుల ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఉపయోగించే సామగ్రి ధరలు జిల్లా కమిటీ నిర్ణయించిన మేరకు ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల సామగ్రి ధరలు, ఎన్నికల పరికరాల మొదటి విడత ర్యాండమైజేషన్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి పాల్గొని మాట్లాడారు. పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని నమోదు చేయడానికి మాత్రమే ఈ రేట్లు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. వీవీప్యాట్స్, ఈవీఎంల ర్యాండమైజేషన్ శుక్రవారం పూర్తి చేసి నాలుగు నియోజకవర్గాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చనున్నట్లు చెప్పారు. ఈవీఎంలను తరలించినప్పుడు అన్ని పార్టీల ప్రతినిధులు వాహనాల వెంట వెళ్లి పరిశీలించవచ్చని, అన్ని వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చినట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మైక్, సౌండ్ సిస్టం అనుమతి కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ఆర్‌అండ్‌బీ ఈఈ యాకోబ్, డీఎం రాంపతి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజేశ్వరరావు, సత్యనారాయణ , రమేష్, గోపి, స్టాలిన్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యయ పరిశీలకులదే కీలక పాత్ర..

ఎన్నికల నిర్వహణలో వ్యయ పరిశీలకులదే కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఆడిట్ బృందాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి అవగాహన కలిగి ఉండాలన్నారు. అభ్యర్థి రూ. 40 లక్షలకు మించకుండా ప్రచారంకోసం వెచ్చించవచ్చని సూచించారు. అభ్యర్థి వారీగా రిజిస్టర్లు వినియోగించాలని, ప్రత్యేక ఫైల్, ఖర్చుల రిజిస్టర్, షాడో రిజిస్టర్ తప్పకుండా ఉండాలన్నారు. అభ్యర్థులు ఖర్చుల వివరాలు రెండు రోజుల్లో సమర్పించకుంటే నోటీసులు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ డీఎం శర్మ, సూర్యాపేట డీఎల్పీఓ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

నిడమనూరు: స్థానిక అధికారులు పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి జే. శ్రీనివాస్ అన్నారు. నిడమనూరు మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలని, ఫాగింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయ అధికారి కృష్ణయ్య, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు గాయాలు

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొత్తగూడెం వద్ద గురువారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన నారబోయిన గ్యార్బీస్ తన భార్య మాజీ ఎంపీటీసీ లూర్దమ్మతో కలిసి ద్విచక్రవాహనంపై ఓ శుభకార్యానికి మిర్యాలగూడ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం సమీపంలోకి రాగానే ఓ లారీ వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లూర్దమ్మ(65) బైక్ పైనుంచి ఎగిరి రహదారిపై పడడంతో అదే లారీ ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త గ్యార్బీస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ నర్సింహులు, ఏఎస్‌ఐ ఉమాపతిరావు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన మృతురాలి భర్త గ్యార్బీస్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం లూర్దమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మరో ప్రమాదంలో మహిళ దుర్మరణం..

కోదాడరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం పాలైంది. ఈ సంఘటన పట్టణ పరిధిలోని మేళ్లచెర్వు ఫ్లైఓవర్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గురువారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామానికి చెందిన చుక్కా వెంకటేశ్వర్లు భార్య వీరమ్మ(50)తో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై కోదాడ మండలంలోని బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం అర్ధరాత్రి 12గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మేళ్లచెర్వు ఫ్లైఓవర్ వద్ద వారి వాహనాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరమ్మకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాలయ్యాయి. మృతురాలి కుమారుడు గోపిచంద్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సారా తయారీ స్థావరాలపై అధికారుల దాడులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎక్సైజ్ డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ అధికారులు సారా తయారీ స్థావరాలపై సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. ఎక్సైజ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా మఠంపల్లి మండలంలోని బిల్యానాయక్‌తండా, కొత్తతండా, రామచంద్రాపురం తండా, సుల్తాన్‌పూర్‌తండాల్లోని పలు సారా తయారీ కేంద్రాలపై దాడు నిర్వహించారని అన్నారు. ఈ దాడుల్లో 3వేల లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి, 40 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా మేళ్లచెరువు మండలంలోని హేమ్లా తండా నుంచి మేళ్లచెరువుకు టీవీఎస్‌పై తరలిస్తున్న లావుడ్యా బాబు వద్ద నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మఠంపల్లి మండలం కొత్తతండా నుంచి మఠంపల్లికి బాణోతు బాబు మోటార్‌సైకిల్‌పై తరలిస్తున్న 10లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు మహిళలపై కేసు నమోదు..

మఠంపల్లి మండలంలో బిల్యానాయక్ తండాలో భూక్యా మంగ్యా ఇంట్లో తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా ఎక్సైజ్ అధికారులను అడ్డుకుని దూషించినందుకు ధీరావత్ విజయ, బాణోతు పసాలో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ బాలకృష్ణ, ఎక్సైజ్ ఎస్‌ఐలు జగన్‌మోహన్‌రెడ్డి, దివ్య, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

చెక్కు బౌన్స్ కేసులో జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట): చెక్కు బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. సూర్యాపేట పట్టణానికి చెందిన గండూరి ప్రభాకర్ వద్ద కొడూరి వెంకన్న 2013లో రూ.లక్ష అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో 2016లో అప్పుతో పాటు వడ్డీకి సంబంధించి వెంకన్న రూ.1.70లక్షల చెక్కును ప్రభాకర్‌కు ఇచ్చాడు. ఆ చెక్కుకు సంబంధించిన ఖాతాలో నగదు లేకపోవడంతో ప్రభాకర్ కోర్టును ఆశ్రయించాడు. విచారించిన న్యాయమూర్తి కొండూరి వెంకన్నకు 6నెలల జైలు శిక్షతో పాటు, రూ.3.40లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

ఎయిర్ కంప్రెషర్ పేలి ఇద్దరికి తీవ్రగాయాలు

మోత్కూరు: ఎయిర్ కంప్రెషర్ పేలి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మున్సిపాలిటీలోని అంగడిబజార్ పాత ఇనుప సామాను దుకాణంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాలిటీకి చెందిన ఖలీమొద్దిన్ పట్టణంలో పాత ఇనుప సామగ్రి దుకాణాన్ని కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాడు. పాత ఇనుప సామాన్ల కొనుగోలులో భాగంగా ఆయన ఓ ఎయిర్ కంప్రెషర్ (వాహనాలకు గాలి కొట్టే మిషన్) కొనుగోలు చేశాడు. ఆ ఏయిర్ కంప్రెషర్‌ను ముక్కలుగా చేయడానికి స్థానికంగా బిందెలను తయారు చేసే సోమలింగాచారిని పిలిపించాడు. దీంతో సోమలింగాచారి తన వద్ద ఉన్న పనిముట్లతో విషన్‌ను కొడుతుండగా ఘర్షణ ఏర్పడి కంప్రెషర్ ఒక్కసారిగా పేలి సోమలింగాచారి, దుకాణంలో పని చేసే ఎండీ లతీఫ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో మంటలు సైతం ఏర్పడ్డాయి. వెంటనే అందులో పనిచేసే మిగతా కూలీలు నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. అనంతరం తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడి నిత్య కల్యాణం


తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణలో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ తలంబ్రాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాల పోటీలకు శ్రీనివాస్ ఎంపిక



మెడల్ చూపిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాస్ జాతీయ స్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికయ్యారు. కాగా ఈనెల 18, 19తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో 45సంవత్సరాలు పైబడిన విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఆయన పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి 3వ స్థానంలో నిలిచాడు. దీంతో నవంబర్‌లో అస్సాం రాష్ట్రం గౌహతిలో జరిగే జాతీయ యోగాసనాల పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను గురువారం సర్పంచ్ యాకరి రేణుక నర్సింహ, ఎంపీటీసీ శంకరమ్మకృష్ణయ్య, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


లక్ష్మీశ్వేత(ఫైల్)

కనగల్ : ఇటీవల పాముకాటుకు గురైన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానిక ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన గోలి లక్ష్మీశ్వేత(26) ఇదే గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీళ్లబావి గ్రామానికి చెందిన మద్దిరాల జగన్‌మోహన్‌రెడ్డి నిమ్మతోటలోకి మంగళవారం నిమ్మకాయలు కోసేందుకు కూలికి వెళ్లింది. ఈ క్రమంలో లక్ష్మీశ్వేత పనులు చేస్తుండగా ఓ పాము కాటేసింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ శ్వేత చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్వేతకు 7, 9సంవత్సరాల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్వేత కుటుంబానికి భూమి లేకపోవడంతో భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతురాలి అక్క మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్

- కుటుంబ పాలనపై రాహుల్‌గాంధీ మాట్లాడడం విడ్డూరం
- బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం
- మంత్రి జగదీష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి చిత్రంలో ఎంపీ బడుగుల

సూర్యాపేట : ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గేను మూలనపడేసిన గాంధీ కుటుంబం.. కుటుంబ పాలన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం సూర్యాపేటలోని జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌కు ఉన్న ఏకైక అర్హత వారసత్వ అర్హతనేనని అన్నారు. కుంభకోణాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. పగలు దొంగతనం చేస్తూ దొరికిపోయిన పగటి దొంగ రాసిచ్చిన స్క్రిప్టును రాహుల్ చదువుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల ఖర్చు రూ.లక్ష కోట్ల లోపే ఉంటుందని, అలాంటప్పుడు లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్ ఎలా అంటారని ప్రశ్నించారు. ఇంత అవినీతి జరిగితే ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. కాంగ్రెస్ బస్సు యాత్ర తుస్సుమనడం ఖాయమని అన్నారు. మోదీ దయా దాక్షిణ్యాలపై బతుకుతున్నది గాంధీ కుటుంబమేనని, బోఫోర్స్ కేసులో పీకల్లోతు కూరుకుపోయిన చరిత్ర ఆ కుటుంబానిదేనని విమర్శించారు. గుజరాత్ ఎన్నికల్లో అటువైపు చూడకపోవడమే కాంగ్రెస్, బీజేపీల లాలూచీ రాజకీయాలకు నిదర్శనమని మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ మీద మాట్లాడటం అంటే సూర్యుడి మీద ఉమ్మివేయడమేనని అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని తెలిపారు. కర్ణాటకలో ప్రజలకిచ్చిన హామీలన్నీ వందరోజుల్లోనే బొందపెట్టిన పార్టీ కాంగ్రెస్ అయితే, మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమని చెప్పారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నరసింహారెడ్డి, వై వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాలి

- ఎస్పీ రాహుల్ హెగ్డే


హుజూర్‌నగర్ : పారామిలటరీ సిబ్బంది వసతిని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

హుజూర్‌నగర్ : సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముమ్మర తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం పట్టణ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బందోబస్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలపై, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గురించి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలని, సమస్యాత్మక గ్రామాలను సందర్శిస్తూ ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొల్పడానికి యువత ఆదర్శంగా ఉండాలని ఎస్పీ కోరారు. ఎన్నికల కేసుల్లో చిక్కుకుంటే వారి వ్యక్తిగత వివరాలను పోలీస్ రికార్డుల్లో నమోదు చేస్తారని, రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్‌గా ముద్ర వేయాల్సి వస్తుందని ఎస్పీ హెచ్చరించారు. గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా పనిచేస్తుందన్నారు. అనంతరం ఈనెల 31న హుజూర్‌నగర్ సీఎం పర్యటన సందర్భంగా రామస్వామి గట్టు రోడ్డులో సభాస్థలి పరిశీలించి రక్షణ ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఎస్పీ వెంట హుజూర్‌నగర్, కోదాడ రూరల్ సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

సూర్యాపేటలో వసతి పరిశీలన..

సూర్యాపేట క్రైం : ఎన్నికల్లో భాగంగా జిల్లాలో బందోబస్తు నిర్వహణకు జిల్లాకు రానున్న పారా మిలటరీ సిబ్బంది కోసం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో వసతిని ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ నాగభూషణం, పట్టణ సీఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

మోతె : మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త సీహెచ్.నరేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని సర్వారంలో గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మిరప తోటలను ఆయన పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మిరపలో తామర పురుగులు, నల్లి, తెల్లదోమ ఆశిస్తున్నాయన్నారు. వాటి నివారణకు ఒక ఎకరానికి 50–100 జిగురు అట్టలు (పసుపు, నీలం, తెలుపు) అమర్చుకోవాలన్నారు. అలాగే 10వేల పీపీఎం వేప నూనె లీటరు నీటికి 3మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఏ.కిరణ్ మాట్లాడుతూ.. మిరపలో జీవన ఎరువుల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో రైతులు రాములు, వెంకటాచారి, యల్లయ్య, మల్లారావు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త నరేష్

పాములకే ప్రాణభిక్ష

- 150కిపైగా పాములను పట్టిన వెంకటేష్
- చంపకుండా అటవీ ప్రాంతానికి తరలింపు
- ఆదర్శంగా నిలుస్తున్న బోగారం యువకుడు


రామన్నపేట : బోగారంలో పామును పట్టిన గెంట్యాల వెంకటేష్

రామన్నపేట : పాములను చూడగానే భయంతో పరుగులు తీస్తాము. లేదా కర్రలతో మోది చంపుతాం. కానీ, వాటికి హాని చేయకుండా చాకచక్యంగా బంధించి అడవుల్లో వదులుతున్నాడు బోగారం గ్రామానికి చెందిన గెంట్యాల వెంకటేష్. ఇప్పటి వరకు 150కి పైగా పాములను పట్టి అడవుల్లో, జన సంచారం లేని ప్రదేశాల్లో వదిలాడు.

కరీంనగర్‌జిల్లా మామిడిపల్లి మండలానికి చెందిన గెంట్యాల రాములు – శారదల కుటుంబం ఉపాధికోసం కొన్నేళ్ల క్రితం ముంబయికి వలస వెళ్లింది. వారికి ముగ్గురు ఆడ, ఇద్దరు మగ సంతానం. అందరికంటే చిన్నవాడు వెంకటేష్. ఏడవ తరగతి వరకు చదివి మధ్యలో ఆపేశాడు. పిల్లలు పెద్దవారైన తరువాత ఆ కుటుంబం హైదరాబాద్‌కు మకాం మార్చింది. సుమారు ఏడేళ్ల క్రితం బాల్‌నగర్‌లోని నివాసం ఉంటున్న అద్దె ఇంటిలోకి తాచుపాము వచ్చింది. వెంకటేష్ కర్రతో పామును చంపాడు. పామును చంపిన తరువాత అతనికి మంచిగా అనిపించలేదు. తప్పు చేశాననే భావన మొదలైంది. జీడిమెట్లలో యూట్యూబ్ లఘు చిత్రాలు చేసే వారితో పరిచయం ఏర్పడింది. వారితో తన ఆవేదనను పంచుకున్నాడు. నాగరాజు, అర్జున్‌ల సహకారంతో ఏడాదిపాటు పాములను పట్టే మెళకువలను నేర్చుకున్నాడు. ప్రస్తుతం బోగారంలో చేనేతవృత్తిని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

అడవుల్లో వదలడమే లక్ష్యం

పాములను పట్టే మెళకులను నేర్చుకున్న గెంట్యాల వెంకటేష్ వాటికి హాని కలగకుండా చూస్తుంటాడు. బోగారంతో పాటు పరిసర గ్రామాల్లోని జనావాసాల్లో పాములు సంచరిస్తున్న విషయం తెలియజేస్తే అక్కడికెళ్లి వాటిని పట్టుకొని డబ్బాల్లో బంధించి అటవీ ప్రాంతంలో వదిలేయడం మొదలు పెట్టాడు. ఇప్పటి వరకు 150కిపైగా వివిధ రకాల పాములను అడవుల్లో వదిలి వాటి ప్రాణాలను కాపాడాడు.

గెంట్యాల వెంకటేష్ సెల్ నంబర్...
7995588770

చంపుకుంటూ పోతే ఏవీ మిగలవు



భూమిపై అనేక జీవరాశులు జీవిస్తున్నాయి. ప్రాణహాని ఉందని చంపుకుంటూ పోతే ఏవీ మిగలవు. భవిష్యత్తు తరాలకు బొమ్మలను చూపించవలసి వస్తుంది. పామును చూసి మనమెంత భయపడతామో, మనల్ని చూసి పాము అంతే భయంతో పరుగులు తీస్తుంది. పాములు పగబడతాయంటే నేను నమ్మను. ఎవరింటిలో గానీ వాడలోగానీ పాము కనబడిందని తెలిస్తే అక్కడివెళ్లి వాళ్ల భయం పొగట్టడంతోపాటు దానిని పట్టి దూరంగా వదిలివేస్తుంటాను. ఇప్పటి వరకు అన్నిరకాల పాములను పట్టి వదిలేయడం జరిగింది.

– గెంట్యాల వెంకటేష్, బోగారం యువకుడు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

నూతనకల్: గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదని డీపీఓ యాదయ్య అన్నారు. గురువారం నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారంలో పల్లె ప్రకృతి వనం, వన నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లు, గ్రామ పంచాయతీ భవనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినప్పుడే వాటి ఫలితాలు ప్రజలకు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చూడి లింగారెడ్డి, ఎంపీడీఓ ఇందిరా, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య


మౌనిక (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : పురుగుల మందు తాగి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చింతలపాలెం మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన కర్లపూడి మౌనిక (22) కోదాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. మౌనికకు ఇటీవల కొందరు వ్యక్తులు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని, అందుకు కొంత నగదు చెల్లించాలని నమ్మించారు. దీంతో ఆమె స్నేహితురాలి వద్ద రూ.28వేలు అప్పు చేసి సదరు వ్యక్తులకు డబ్బులు చెల్లించింది. కొద్ది రోజుల తర్వాత వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మానసిక ఒత్తిడికి గురైంది. దీనికి తోడు సదరు కళాశాల హెచ్‌ఓడీ జోక్యంతో మరింత ఒత్తిడికి గురై ఉంటుందని తెలిపారు. ఇంతలో దసరా సెలవులు రావడంతో ఆమె ఇంటికి వచ్చిన ఆమె ఇంట్లో ఎవరిలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి మౌనికను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. దీంతో స్నేహితులు మౌనిక ఇంటికి చేరుకుని జాబ్ ఇప్పిస్తామని మోసం చేసిన వారితో పాటు హెచ్‌ఓడీ కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మృతిరాలి ఇంటి వద్ద పరిస్థితిని సమీక్షించారు. కళాశాలకు చెందిన సిబ్బంది మృతురాలి ఇంటికి వచ్చి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ సైదిరెడ్డిని సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అద్భుతం.. రంగుల వంతెన


కాగితరామచంద్రాపురం వద్ద ఉన్న రంగుల వంతెన

- యూటీ మీదుగా సాగర్ నీరు పోయేలా కాల్వ నిర్మాణం
- కాల్వపై ప్రయాణికులు వెళ్లేలా వంతెన


వంతెన కింద కాల్వలో ప్రవహిస్తున్న నీరు

నడిగూడెం: మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం వద్ద ఖమ్మం జిల్లా సరిహద్దులో సాగర్ ఎడమ కాల్వపై 1970లో నిర్మించిన వంతెన అద్భుతమైన నిర్మాణ శైలికి నిలువుటద్దంగా నిలుస్తోంది. సాధారణంగా ఒక వంతెనను కాల్వ మీదుగా ప్రజల రాకపోకలు సాగించేందుకు నిర్మిస్తారు. కానీ కాగితరామచంద్రాపురం వద్ద నిర్మించిన వంతెన అలా కాదు. పొలాల్లో నుంచి నీరు పోవడానికి యూటీని నిర్మించారు. ఆ యూటీ మీదుగా సాగర్ నీరు పోయేందుకు కాల్వను నిర్మించారు. అదేవిధంగా ప్రజల రాకపోకలు సాగించడానికి వీలుగా కాల్వ మీదుగా మరొక వంతెన నిర్మించారు. ఈ వంతెన పైనే నాలుగు రహదారులు కలుస్తాయి. దీనిని పూర్తిగా రాతితో నిర్మించారు. ఒకప్పుడు వంతెనకు కాగితరామచంద్రాపురం వైపు ఆంధ్రా ప్రాంతం, అవతలి వైపు నైజాం ప్రాంతం ఉండేదని పూర్వీకులు చెప్పేవారు. ఈ వంతెనను నిర్మించిన సమయంలో ఆకర్షణ కోసం వివిధ రంగులు వేశారు. దీంతో ఆ వంతెన అందంగా కన్పించేది. అందుకే నాటి నుంచి ఆ ప్రాంతం ప్రజలు దీనిని రంగుల వంతెనగా పిలుస్తుంటారు. ఈ వంతెన నిర్మాణంలో కాగితరామచంద్రాపురం, కరివిరాల, మోతె, ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం, ఈశ్వరమాదారం, కొత్తగూడెం గ్రామాలకు చెందిన వందల సంఖ్యలో కూలీలు పనిచేశారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి



ఖమ్మం జిల్లా సరిహద్దులో సాగర్ కాల్వపై ఈ వంతెనను ఎక్కడా లేని విధంగా భిన్నంగా నిర్మించారు. ఈ వంతెన పరిసరాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే బాగుంటుంది. యూటీ మీదుగా కాల్వ, కాల్వపై ప్రజల రాకపోకల కోసం వంతెన ఉండటం ఇక్కడి ప్రత్యేకత.

– శ్రీనివాసరెడ్డి, కాగితరామచంద్రాపురం

ఆహ్లాదకరంగా ఉంటుంది



కాగితరామచంద్రాపురం వద్ద ఖమ్మం జిల్లా సరిహద్దులో వంతెన ఎత్తుగా ఉంటుంది. వంతెన చుట్టూ పచ్చని పొలాలు ఉండడంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రతి ఆదివారం ఇక్కడికి అనేకమంది చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువకులు వస్తుంటారు. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– గుండ్లపల్లి బుచ్చిరాములు, సిరిపురం

భరతనాట్యంలో కోదాడ విద్యార్థినుల ప్రతిభ


రికార్డులు సాధించిన విద్యార్థినులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన భరత నాట్య గురువు తిరుపతిస్వామి శిష్య బృందం 10ప్రపంచ రికార్డులు సాధించారు. ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజిక్ అండ్ డాన్స్ (ఐసీఎండీఏ), గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, కనకదుర్గమ్మ దేవదాయ శాఖ సంయుక్తంగా ఆదిశంకరాచార్య రచించిన మహిషాసురమర్దిని 21శ్లోకాలకు ప్రపంచ వ్యాప్తంగా 9వేల మందికి నిర్వహించిన (వర్చ్వల్) లైవ్ కాంటెస్ట్‌లో వారు పాల్గొని అద్భుతమైన భరతనాట్య నృత్య ప్రదర్శన ఇచ్చినందుకు గాను 10ప్రపంచ రికార్డుల్లో వారు పేర్లు నమోదు చేసుకున్నారు. అక్టోబర్ 18న (బుధవారం) నిర్వహించిన లైవ్ కాంటెస్ట్‌లో కోదాడకు చెందిన శ్రీతన్వీ నటరాజ్ డ్యాన్స్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థినులు అక్షయ, ఉమాశ్రావణి, మనోజ్ఞ, లౌక్య, కుసుమ, అమృశ, మోక్షిత పోటీల్లో కోదాడ నుంచి పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంతో తమ నాట్య పాఠశాల విద్యార్థినులు 10 ప్రపంచ రికార్డులు సాధించడం తమకు గర్వకారణంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను వారి తల్లిదండ్రులు, పురప్రముఖులు అభినందించారు. నాట్య విద్యార్థినులు పేరు నమోదు చేసుకున్న పది ప్రపంచ రికార్డుల సంస్థల్లో ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ద బ్రిటీష్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా వరల్డ్ రికార్డ్స్, నోబోల్ వరల్డ్ రికార్డ్స్, ద ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, మార్వెలెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, జెమ్స్ వరల్డ్ రికార్డ్స్, యూనిక్ వరల్డ్ రికార్డ్స్, ఫెంటాస్టిక్ అచీవ్మెంట్ వరల్డ్ రికార్డ్స్‌లలో నమోదయ్యాయి.

రిపబ్లిక్ డే వేడుకలకు కూరెళ్ల విఠలాచార్యకు ఆహ్వానం


కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన దాశరథి పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్యను కేంద్ర ప్రభుత్వ ప్రసార మంత్రిత్వశాఖ రిపబ్లిక్ డే వేడుకలకు ఆహ్వానించింది. జనవరి 26న ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు హాజరు కావాలని సంబంధిత శాఖ అధికారులు గురువారం ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తన ఇంటిని గ్రంథాలయంగా మలచి రెండు లక్షల పైచిలుకు పుస్తకాలతో 'ఆచార్య కూరెళ్ల గ్రంథాలయం'ను తన స్వగ్రామంలో పెన్షన్ డబ్బులతో నిర్వహిస్తున్న కూరెళ్లను ప్రధాన మంత్రి తన 84వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ప్రశంసించిన విషయం తెలిసిందే.

పోచంపల్లిని సందర్శించిన మహిళా బైక్ రైడర్స్


మగ్గాలు, నూలును పరిశీలిస్తున్న విదేశీ మహిళా బైక్ రైడర్స్ బృందం

భూదాన్‌పోచంపల్లి : అలిసన్ గ్రూప్‌కు చెందిన అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, సింగపూర్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన 9మంది ఫ్రీడబ్లూ ఫ్రెంచ్ మహిళా బైక్ రైడర్స్ బృందం గురువారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. కాగా వారికి పద్మశాలి యువజన సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు చేనేత గృహాలను సందర్శించి మగ్గాలపై తయారవుతున్న పట్టుచీరలు, ఇక్కత్‌వస్త్రాల తయారీని స్వయంగా పరిశీలించారు. కాగా భారత గగనమ్మ అనే మహిళా కార్మికురాలు నేత నేసే విధానాన్ని చూసి అబ్బురపడ్డారు. వారికి పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్ చేనేత పరిశ్రమ తీరుతెన్నులు, మార్కెటింగ్, ఇక్కత్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గుర్తింపు, కార్మికుల జీవనస్థితిగతులను వివరించారు. ఈ సందర్భంగా విదేశీ మహిళా రైడర్స్ మాట్లాడుతూ.. జైభారతీ నేతృత్వంలో తెలంగాణ పర్యటనకు వచ్చామని, అందులో భాగంగానే పోచంపల్లి ఇక్కత్‌ను ప్రపంచ వ్యాప్తంగా తమవంతుగా ప్రమోట్ చేయడానికి పోచంపల్లి సందర్శనకు వచ్చినట్లు వెల్లడించారు. వారి వెంట ఉపాధ్యక్షుడు రుద్ర చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆడెపు అరవింద్, సహాయ కార్యదర్శి ఆటిపాముల ధర్మేందర్, ఏలే శివశంకర్ తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

మోత్కూరు : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం అర్ధరాత్రి పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5.44 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కుంచం వినోద్ అనే వ్యక్తి తన బైక్‌పై ఏలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.5.44 లక్షల నగదు పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగార్జునసాగర్ : ఆంధ్రా –తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ కొత్త వంతెన వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.1.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని చీరాలకు చెందిన వెంకటబుచ్చేశ్వరరావు సరైన పత్రాలు లేకుండా నగదు తరలిస్తుండడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

అడ్డగూడూరు : మండలంలోని చిర్రగూడూరు–తొర్రూర్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎన్నికల కోడ్ అమలులో భాగంగా గురువారం మండల పోలీసులు, అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం యెడవెల్లి గ్రామానికి చెందిన నెల్లుట్ల మహేష్ నుంచి రూ.1,19,000 నగదు పట్టుకున్నారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు మండల ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

నకిరేకల్‌లో రూ.5లక్షలు..

నకిరేకల్ : ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోని తిప్పర్తి రోడ్డులో గురువారం సాయంత్రం సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో కేరళ రాష్ట్రానికి చెందిన ఓ వ్యాపారి వరంగల్‌కు తన వ్యాపారం నిమిత్తం రూ.5లక్షల నగదుతో కారులో వెళ్తుండగా పట్టుబడినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

రామన్నపేటలో రూ.3.50లక్షలు సీజ్


రామన్నపేట : మండల కేంద్రంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో చిట్యాలకు చెందిన నవీన్‌కుమార్ తన ద్విచక్రవాహనంలో ఏలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.50లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.5లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట స్థానిక పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఎస్‌కె.జోస్న భర్త రఫీతో కలిసి కారులో నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి కారును తనిఖీ చేయగా రూ.4లక్షలు పట్టుకున్నారు. అదే విధంగా ఇగుటూరి రాజశేఖర్ అనే వ్యక్తి రెంటచింతల నుంచి హైదరాబాద్‌కు కారులో ఏలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అప్పగించినట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

శాలిగౌరారం : మండలంలోని వంగమర్తి సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్‌ఐ సతీష్ నేతృత్వంలో గురువారం మండల పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మూడు వాహనాల్లో ఏలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.87లక్షలు నగదును పట్టుకొని సీజ్ చేశారు. పట్టుబడిన నగదును జిల్లా ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగారం : మండల కేంద్రంలోని సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో బోలేరో వాహనంలో వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి ఏలాంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎర్ర సైదులుగౌడ్ తెలిపారు. ఆ నగదును సీజ్ చేసి ఎన్నికల సూపరింటెండెంట్ మద్దెల ముత్తయ్యకు అప్పగించామన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి


హాలియా : మృతి చెందిన చింత రవీందర్‌రెడ్డి

నేలకొండపల్లి : ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లి గ్రామం వద్ద గురువారం చోటు చేసుకుంది. నేలకొండపల్లి ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని బండలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాశిమళ్ల సంజయ్(38) ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం గ్రామంలో గల ఓ రైస్‌మిల్లులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంజయ్ రోజు మాదిరిగానే గురువారం తన పని ముగిశాక ద్విచక్రవాహనంపై స్వగ్రామం లక్ష్మీపురానికి బయలుదేరాడు. మార్గమధ్యలో సుర్దేపల్లి వద్దకు రాగానే ఓ రైతు ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపిఉంచడంతో ప్రమాదవశాత్తు తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో సంజయ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

అనుముల మండలంలో ఒకరు..

హాలియా : ఆగిఉన్న ట్రాక్టర్‌ను బైక్‌తో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరోకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన అనుముల మండలంలోని చింతగూడెం స్టేజీ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన చింత రవీందర్‌రెడ్డి (28), ముత్యాల కొండలు ద్విచక్రవాహనంపై పనినిమిత్తం హాలియాకు వచ్చారు. తిరిగి పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో చింతగూడెం స్టేజీ వద్ద రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న చింత రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా ముత్యాల కొండల్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలం వద్ద చేరుకుని రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండల్‌ను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.